సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- పోలీస్ అకాడమీలో ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభం

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పోలీసు సిబ్బంది ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో మంగళవారం ప్రీ ప్రమోషనల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను మంచి రాబడి వచ్చే రంగాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్బీవీఆర్ఆర్, టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్ట్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు.

కుప్పకూలిన నిర్మాణరంగం

మొదటిపేజీ తరువాయి...

అధికారిక లెక్కలను పరిశీలించినా నిర్మాణరంగం క్రమంగా కుదేలవుతున్నదనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి. రియల్ఎస్టేట్, నిర్మాణ రంగాలంటేనే శివారు ప్రాంతాలు. అలాంటిది రెండేండ్లతో పోలిస్తే చుట్టూ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ అనుమతుల్లో భారీ తగ్గుదల నమోదుకావడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతున్నది. 2019లో ఈ రెండు రంగాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత అనూహ్యంగా కొవిడ్‌తో లావాదేవీలు, క్రయవిక్రయాలు కాస్త మందగించాయే కానీ భారీ తగ్గుదల నమోదు కాలేదు. అందుకే కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణ రంగానికి లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సి వచ్చింది. కొవిడ్ అనేది రెండు రంగాలకు ఒక స్పీడ్ బ్రేకర్‌గా మాత్రమే మారింది. కానీ, దూకుడును తగ్గించలేకపోయింది. నగరం చుట్టూ ఉన్న స్థానిక సంస్థల పరిధిలో 2021, 2022 సంవత్సరాల్లో అనుమతుల సంఖ్యను చూస్తే ఇదే విషయం అర్థమవుతుంది. ప్రధానంగా 2021 నుంచి 2022కు అనుమతులు 22% మేర పెరిగాయి.

పడిపోతున్న అనుమతులు

రాష్ట్రంలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఆదిలో రియల్ ఎస్టేట్-నిర్మాణ రంగాల్లో కొంత మేర స్తబ్ధత నెలకొన్నా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ ఇలాగే ఉంటుందని నిపుణులు సైతం అనుకున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ నిర్మాణ రంగాలు ఊపందుకుంటాయని చెప్పారు. హైడ్రా దూకుడుగా నిర్మాణాల కూల్చివేత చేపట్టడంతో రేపో మాపో కోలుకుంటుందనుకున్న రియల్ ఎస్టేట్-నిర్మాణ రంగాల్లో అదే స్తబ్ధత కొనసాగడంతోపాటు తగ్గుదల మొదలైంది. 2023తో పోలిస్తే 2024లో 16 స్థానిక సంస్థల పరిధిలో అనుమతులు ఏకంగా 36% తగ్గాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. దాని ఫలితంగానే రియల్టర్లు, బిల్డర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. దాని పర్యవసానంగానే నిర్మాణ రంగంలో ఆత్మహత్యలు చోటుచేసుకోవడం దురదృష్టకరం.

మున్సిపాలిటీ	2022	2023	2024
ఆదిభట్ల	141	192	294
ఆమనగల్	68	70	65
బడంగ్‌పేట్	3,335	3,605	1,320
బండ్లగూడ జాగీర్	1,248	1,321	1,147
ఇబ్రహీంపట్నం	240	166	110
జల్‌పల్లి	97	166	116
కొత్తూరు	34	31	24
మణికొండ	86	843	263
మీర్‌పేట్	1,119	358	388
నార్సింగి	152	186	193
పెద్ద అంబర్‌పేట్	245	,097	790
షాద్‌నగర్	697	609	250
శంషాబాద్	24	74	43
శంకర్‌పల్లి	367	343	212
తుక్కుగూడ	168	112	114
తుర్కయాంజాల్	363	1,627	1,620

'ఇందిరమ్మ' గైడ్‌లైన్స్‌పై కాలయాపన

- నగరాలు, పట్టణాల్లో లక్షల దరఖాస్తులు పెండింగ్
- సొంత జాగాలు లేనివారు 90% పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంతవరకు జారీ చేయలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి గ్రేటర్ హైదరాబాద్‌లోని 25 నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని 40 అర్బన్ నియోజకవర్గాల్లో పేదల నుంచి దాదాపు 82 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మార్గదర్శకాలు లేకపోవడంతో వాటిని పెండింగ్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలి దశలో జాగా ఉన్నవారికే ఇల్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఇంటిని పొందే అర్హత కోల్పోతున్నారు. మురికివాడల్లో నివసిస్తున్న పేదల్లో ఎక్కువ శాతం మందికి సొంత జాగాలు లేవు. వారంతా అనాదిగా ప్రభుత్వ భూముల్లోనే గుడిసెలు, కచ్చా ఇండ్లు నిర్మించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా కాలం నుంచి వారు అక్కడే ఉంటుండడంతో కరెంట్, నల్లా కనెక్షన్లు మంజూరయ్యాయి. కానీ, ఇండ్ల పట్టాలు గానీ, ఆయా జాగాలపై యాజమాన్య హక్కులు సూచించే ధ్రువపత్రాలు గానీ లేవు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 10 లక్షల మందిలో 90% మందికి సొంత జాగాలు లేవు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర పట్టణాల్లో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నది. దీంతో వారంతా ఇందిరమ్మ ఇల్లు పొందే అర్హత కోల్పోయినట్టే.

పట్టణాల్లో రెండు విధాలుగా ఇండ్ల నిర్మాణం

ప్రభుత్వ జాగాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వడం ఒక విధానమైతే, ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశం నుంచి పేదలను ఖాళీ చేయించి అదేచోట అపార్ట్‌మెంటు నిర్మించి అందరికీ కేటాయించడం మరో విధానం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జియాగూడ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఈ విధంగానే అపార్ట్‌మెంట్లు నిర్మించి లబ్ధిదారులకు అందించింది. ఇతర మురికివాడల్లో నివసిస్తున్నవారికి ప్రభుత్వ జాగాలు ఉన్నచోట డబుల్ బెడ్రూమ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్‌లోని లక్ష పేద కుటుంబాలకు ఇండ్లను సమకూర్చింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాగాలు లేవనే కారణంతో పట్టణ పేదలకు ఇండ్లను మంజూరు చేయకుండా, కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తున్నది.

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు 30 వేలు లంచం

ధారూరు, ఫిబ్రవరి 11 : లంచం తీసుకుంటూ వికారాబాద్ జిల్లా ధారూరు ఎస్సై మంగళవారం ఏసీబీకి చిక్కాడు. ధారూరు మండలం నాగసముందర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తన ప్రైవేటు డ్రైవర్ బీరప్ప ద్వారా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు మంగళవారం రూ.30 వేలు లంచం ఇవ్వగా ఏసీబీ అధికారులు ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్, టెన్త్ పరీక్షలు ముగిసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్‌తో కలిసి ఎలక్షన్ కమిషన్ సంయుక్త కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

కుంభమేళాకు వెళ్లివస్తూ.. ఏడుగురు దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

బస్సు నుజ్జునుజ్జయ్యింది. ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. బస్సులో ఇరుక్కుపోయిన మరో ఆరుగురిని స్థానికులు బయటకు తీసి జబల్‌పూర్ మెడికల్ కాలేజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మినీ బస్సు వెనుక ఓ కారు కూడా ప్రమాదానికి గురైనప్పటికీ అందులో ఉన్నవారు సురక్షితంగా బయటపడినట్టు ఏఎస్పీ సూర్యకాంత్ శర్మ తెలిపారు.

నాచారంలో విషాదఛాయలు

ఈ ఘటన మృతులంతా నాచారంలోని రాఘవేంద్రనగర్, కార్తికేయ నగర్‌కు చెందినవారు. మంగళవారం తెల్లవారుజామునే బయలుదేరుతామని కుటుంబసభ్యులకు చెప్పారు. ఉదయాన్నే ప్రమాదవార్త తెలియడంతో రోదనలు మిన్నంటాయి. మృతుల్లో నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్ ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్టు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో లోపాలు

- కొన్ని కులాలకు తీవ్ర అన్యాయం
- లోపాలు సవరించి న్యాయం చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వర్గీకరణపై చర్చిస్తున్న మంద కృష్ణమాదిగ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను చిత్తశుద్ధితో చేపట్టినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, సీఎంకు ఒక సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వర్గీకరణలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. అసెంబ్లీలో చర్చించి, క్యాబినెట్ సబ్ కమిటీ, న్యాయ కమిషన్లను నియమించి, నివేదికలపై క్యాబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని తెలిపారు. లోపాలు, అభ్యంతరాలను క్యాబినెట్ సబ్ కమిటీతోపాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మందకృష్ణ చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయని స్పష్టంచేశారు. కొన్ని కులాలకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రధానంగా వెనుకబడిన మాదిగ కులానికి అన్యాయం జరిగిందని తెలిపారు. 'గ్రూప్ బీ'కి కేటాయించిన రిజర్వేషన్లను 9 నుంచి 11 శాతానికి పెంచాలని కోరినట్టు వివరించారు. ఎక్కువ జనాభా ఉన్న నేత కానీలను మాలలున్న సీ గ్రూప్‌లో వేయడం వల్ల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. జనాభా తక్కువగా ఉన్న కొన్ని కులాలను మొదటి గ్రూప్‌లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని, అదే సమయంలో ఎక్కువ మంది ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన ఏ గ్రూపులో వేశారని తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు కేటాయించారని మండిపడ్డారు. వీటితోపాటు పలు అంశాలను సీఎంతోపాటు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి వివరించినట్టు చెప్పారు.

మహిళా పోలీసులు 4,782 మందే

ఇచ్చినట్టు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఒక ప్రకటనలో వెల్లడించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్‌శాఖలో అన్ని విభాగాల్లో మొత్తం 76,292 మంది అధికారులు, సిబ్బంది ఉండగా, వీరిలో మహిళా అధికారులు, సిబ్బంది 4,782 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎస్సీ నుంచి డీజీ స్థాయి వరకు 67 మంది, కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 3,642 మంది, ఏఆర్‌లో 1,073 మంది ఉన్నారు. మరో 868 మంది హోంగార్డులుగా ఉన్నారు. సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు పోలీస్‌శాఖ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం

ఎస్సార్ విజయకేతనం..

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11: జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ విద్యా సంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు విద్యాసంస్థల చైర్మన్ వరదా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లాల నాగసిద్ధార్థ(ఫిజిక్స్‌లో 99.97 పర్సంటైల్) సాధించి ఎస్సార్ కీర్తిప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టినట్టు చెప్పారు. తాడిపర్తి తేజస్ ఉద్భవ్ రెడ్డి(99.83), మారం రాజవర్షిత్‌రెడ్డి (99.81), దిడ్డి ప్రజ్వల్‌కుమార్ (99.77), యాద భరణిశంకర్ (99.77), చల్లా అన్సిక(99.66), మేడ కార్తీక్ (99.66), జోగు అభిరాం (99.60), కడారి సంజయ్ (99.58), చిన్ని కమలావర్ధన్(99.58)తోపాటు మొత్తం 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. విద్యార్థుల తోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

ఏటీసీని సందర్శించిన సంజయ్ కుమార్

కోర్సులను పరిశీలిస్తున్న సంజయ్ కుమార్

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల వెనకాల నూతనంగా నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ని రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీఐతో పాటు, నూతనంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సుల శిక్షణ ద్వారా విద్యార్థులకు ప్రత్యేక సాంకేతికతతో కూడా కూడిన శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కోర్సులో 172 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ మోతీలాల్, చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్, టాటా సంస్థ స్టేట్ కో ఆర్డినేటర్ బస్వరాజు, తహసీల్దార్ సతీశ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్ పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

బెల్లంపల్లి, ఫిబ్రవరి 11 : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కామర్స్ విద్యార్థులు ఆ విభాగాధిపతి మేడ తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం మందమర్రి మండలం అందుగులపేటలోని సాయి నందిని సిరామిక్స్ పరిశ్రమలో క్షేత్ర పర్యటన చేశారు. సిరామిక్సులో తయారయ్యే వస్తువులు, ఉత్పత్తులు, అమ్మకాలు, దిగుబడులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రేష్మ, కామర్స్ లెక్చరర్ మహమ్మద్ రఫీ, అధ్యాపకులు పైడాకుల రవి, సునీల్, బుద్దే వంశీకృష్ణ, సిరామిక్స్ వ్యవస్థాపకులు గోపాల్ జాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 11: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మండల వారిగా ఓటరు జాబితా విడుదల చేసినట్లు సీఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లాలోని 15 మండలాల్లో 3,54,691 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,77,105 మంది పురుషులు, మహిళా ఓటర్లు 1,77,567 మంది, 19 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

దండేపల్లి, ఫిబ్రవరి 11 : చట్టాన్ని ఉల్లంఘించి, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దండేపల్లి ఎస్ఐ తహసీవుద్దీన్ హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాత్రి వేళల్లో ఎవరు అనవసరంగా తిరగవద్దని, యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని, తల్లిదండ్రులు, యువతులు, మహిళలపై ఎవరైనా దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈజీఎస్ ఫీల్డ్ ఆసిస్టెంట్‌పై తేనెటీగల దాడి

నెన్నెల, ఫిబ్రవరి 11 : మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన ఈజీఎస్ ఫీల్డ్ ఆసిస్టెంట్ లగ్గామ చంద్రయ్యపై మంగళవారం తేనెటీగలు దాడిచేయడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కూలీలతో పనులు చేయిస్తూ మరో చోటుకు వెళ్తుండగా, ఒక్కసారిగా తేనెటీగలు చంద్రయ్యపై దాడిచేశాయి. పరుగులు తీస్తూ రోడ్డు ఎక్కాడు. చంద్రయ్య అరుపులు విని సమీపంలో ఉన్న రైతులు కొందరు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఎంపీడీవో దేవేందర్, ఈజీఎస్ ఏపీవో నరేశ్ బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు వెళ్లి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

వేమనపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని సూరారం అంగన్‌వాడీ టీచర్ బుర్ర లక్ష్మీకాంత(65) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు దవాకానలో చూపించినా తగ్గలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మృతిచెందింది. లక్ష్మీకాంత 30 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నది.

పత్తి రైతులకు 'టీఆర్' ఇక్కట్లు

- బుక్కులు లేక 15 రోజులుగా నిలిచిన వైనం
- ఏఈవోల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 11 : చింతలమానేపల్లి మండలంలో రైతులకు సీసీఐ కేంద్రంలో పత్తి అమ్మేందుకు టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్) ప్రక్రియ పదిహేను రోజులుగా నిలిచిపోయింది. గత నెల చివరి వారం నుంచి రైతులు ఏఈవోల చుట్టూ తిరుగుతున్నా బుక్కులు రావడం లేదంటూ దాటవేస్తున్నారు. ఇక మండలంలో ఆరు క్లస్టర్లు ఉండగా, సీజనల్ ప్రారంభంలో ఒక్కొక్కరికి రెండు బుక్కులు ఇచ్చారు. వీటిని కేవలం నెలలోపే రైతులకు జారీ చేసినట్లు చెబుతున్నారు.

పట్టించుకోని వ్యవసాయ అధికారులు..

మండలంలోని రైతులు ఎక్కువగా భూములు కౌలు తీసుకొని పంట పండించారు. ఇంకొందరు భూములు ఉన్నా పట్టాలు లేక అవస్థ పడుతున్నారు. ఈ సమయంలో పండించిన పంటను సీసీఐ కేంద్రాల్లో అమ్మేందుకు టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్)పై ఆధారపడుతున్నారు. దీని కోసం కౌలు ఇచ్చిన రైతుల భూ వివరాలతో వ్యవసాయ శాఖ ఏఈవోలకు దరఖాస్తు చేసుకుంటే ధ్రువీకరించి టెంపరరీ రిజిస్ట్రేషన్ లెటర్ ఇస్తారు. దానితో పాటు ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలతో సీసీఐ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేస్తే వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ధ్రువీకరిస్తారు. అయితే ఈ పక్రియ ఇప్పుడు దళారులకు ఈజీగా, రైతులకు కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. పదిహేను రోజులుగా టీఆర్ బుక్‌లు జిల్లా ఆఫీస్ నుంచి రావడం లేదని వ్యవసాయ విస్తరణ అధికారులు చెబుతున్నారు. అయితే కొందరు దళారులకు మాత్రం అందుతున్నాయన్న వాదన వినిపిస్తున్నది. ఇదే విషయంపై వ్యవసాయ అధికారి కృతిషను వివరణ కోరగా.. తన దగ్గర ఎటువంటి జాప్యం లేదని, బుక్‌లు రావడం లేదని చెప్పారు. బాలాజీ అనుకోడకు చెందిన ఓ రైతుకు తెలియకుండానే ఆయన పట్టా మీద వేరే వ్యక్తులు టీఆర్‌లు స్పష్టించి, పత్తి అమ్ముకున్నట్లు ఆ రైతు తెలిపారు.

విద్యా శాఖ కార్యక్రమాలు అమలు చేయాలి

- ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణరెడ్డి

సమావేశంలో సత్యనారాయణరెడ్డి

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 11: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు విద్యాశాఖ చేపట్టే కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి లలిత సమక్షంలో నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో మంగళవారం జిల్లాలోని ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థుల కోసం విద్యాశాఖ అమలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పదోతరగతి విద్యార్థులకు చక్కటి ప్రణాళికతో యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని వందశాతం ఫలితాలు తీసుకురావడమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. వివిధ కార్యక్రమాల కోసం అందిస్తున్న నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలన్నారు. ఈ సమావేశంలో పరీక్షల విభాగం సహాయ కమిషనర్ దామోదర్‌రావు, జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చౌదరి యశోదర, శ్రీనివాస్, సత్యనారాయణ మూర్తి, రాజ్‌కుమార్, వివిధ మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నస్పూర్‌లోని తీగల్‌పహాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సత్యనారాయణరెడ్డి సందర్శించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడ అందిస్తున్న విద్యావిధానంపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. పాఠశాల హెచ్ఎం రామన్న, ఉపాధ్యాయులున్నారు.

నస్పూర్‌లో 40, 42 భూముల సర్వే

సర్వేకు వచ్చిన అధికారులు, సిబ్బంది

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 11 : నస్పూర్ శివారులోని 40, 42 సర్వే నంబర్లలోని భూములను రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే చేశారు. గతేడాది సెప్టెంబర్ 19న సర్వే నంబర్ 42 ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేశారని డీకొండ అన్నయ్యకు చెందిన ఐదంతస్తుల భవనాన్ని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. నస్పూర్ సర్వే నంబర్ 40/2లో 350 గజాల భూమిని డీకొండ అన్నయ్య 2019లో పొనగోటి ప్రేమలత-గోపాల్‌రావు వద్ద కొనుగోలు చేశాడు. తర్వాత ఇంటి నిర్మాణ కోసం మున్సిపల్ కార్యాలయంలో అనుమతి కోసం దరఖాస్తు చేశాడు. అధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో ఆయన ఇంటి నిర్మాణం మొదలు పెట్టాడు. మొత్తం 5 అంతస్తుల భవనం నిర్మించాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఇక్కడే ఉన్నారు. అయితే డీకొండ అన్నయ్య కొనుగోలు చేసిన భూమిలో కాకుండా సర్వేనెంబర్ 42 ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించాడని మున్సిపల్ అధికారులు ఆ భవనాన్ని కూల్చివేశారు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. ఆయన కొనుగోలు చేసిన సర్వే నంబర్ 40/2 పట్టా భూమి, పక్కనున్న సర్వేనెంబర్ 42 భూముల్లో సమగ్ర సర్వేచేసి నివేదికలు అందించాలని కోర్టు ఆదేశించడంతో నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం మోకామీదికి వచ్చి సర్వే చేసి హద్దులను గుర్తించారు. కోర్టు ఆదేశాల మేరకు సర్వే నివేదికలు అందజేస్తామని వారు తెలిపారు. సర్వేను నిర్వహించి పక్కాగా హద్దులు ఏర్పాటు చేయాలని, తమకు జరిగిన అన్యాయం ఎవరికీ జరుగవద్దని అన్నయ్య అధికారులను కోరాడు. సర్వేకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు.

పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రదర్శన

హాజీపూర్, ఫిబ్రవరి 11 : త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియను పురస్కరించుకొని ఎన్నికల పోలింగ్ కేంద్రాల జాబితాలను ఆయా మండలాల ఎంపీడీవో కార్యాలయాల నోటీస్ బోర్డులపై అంటించారు. హాజీపూర్ మండలంలో ఆరు ఎంపీటీసీ, 1 జడ్పీటీసీ స్థానాలుండగా, 31 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో మొత్తం 16,980 మంది (పురుషులు 8,379, మహిళలు 8,601 మంది) ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల, ఫిబ్రవరి 11 : కౌటాల ఎంపీడీవో కార్యాలయ నోటీస్ బోర్డుపై ఎంపీడీవో కోట ప్రస